శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఎస్పి

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లాలో శాంతిభద్రతాలకు విఘాతం కలుగకుండా అల్లరి మూకలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, నిరంతరం శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నామని ఎస్పి మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు. నగరంలోని ఫైర్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం మాబ్ ఆపరేషన్ డ్రిల్ పేరుతో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని ఎస్పి మేరీ ప్రశాంతి సారధ్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంతో ఆందోళనకారులు ఏ విధంగా వ్యవహరిస్తే దానికి పోలీసు బలగాలు ఏ విధంగా ప్రతిస్పందిస్తాయో చూపించారు. అనంతరం పోలీసు బలగాలు ఎస్పి మేరీ ప్రశాంతికి రిపోర్టు చేశాయి. అనంతరం ఎస్పి మేరీప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఎన్నికలు ముగిసిన అనంతరం కౌంటింగ్‌కు కొంత సమయం ఉండడంతో కొంతమంది అల్లరి మూకలు అల్లర్లకు తెగబడుతున్నారని, వారిని నిరోధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఆరోగ్యశ్రీకి సుస్తీ..!

పేదవాడి ఆరోగ్యంతో ప్రభుత్వం ఆడుకుంటోంది. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో ప్రయివేటు ఆసుత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బుధవారం నుంచి నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజానీకం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెండు జిల్లాల్లోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ 60కుపైగా సర్జీలు జరుగుతుంటాయి. ఒక్కసారిగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో రోగులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కొన్ని ఆసుపత్రుల్లో కొనసాగుతున్నట్లు చెబుతున్న మాటలు బూటకంగా మారాయి. ఏలూరు జిల్లాలో అతిపెద్ద మెడికల్ ఆసుపత్రి 'ఆశ్రం'లో ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోవడంతో రోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించి ఆరోగ్యశ్రీ ఆగకుండా చూడాలని జనం కోరుతున్నారు.

- ఆసుపత్రులకు బకాయిలు విడుదలగాక సేవలు నిలిపివేత
- రెండు జిల్లాల్లో 60 ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు
- ప్రతిరోజూ 60కిపైగా ఆరోగ్యశ్రీలో వివిధ సర్జరీలు
- 'ఆశ్రం'లో సేవలు నిలిపివేతతో తీవ్ర ప్రభావం
- గగ్గోలుపెడుతున్న రోగులు..
- దాదాపు రూ.70 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్యుడికి అందనంత ఎత్తుకు వైద్యం, విద్య ఖర్చులు పెరిగిపోయాయి. ఆరోగ్యశ్రీ లేకపోతే సామాన్యులు వైద్యం చేయించుకోలేని పరిస్థితి నెలకొనగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వాలు ఏమాత్రమూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వైద్యం విషయంలో సామాన్యులకు ఎంతో కొంత ఆసరాగా ఆరోగ్యశ్రీ సేవలు నిలుస్తున్నాయి. గుండె ఆపరేషన్లు, కిడ్నీలకు డయాలసిస్, ఎముకలు సర్జీలు, కేన్సర్ రోగులకు కీమోథెరఫీ వంటి సేవలు ఆరోగ్యశ్రీలో కీలకంగా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రులు సేవలు నిలిపివేసిన పరిస్థితి నెలకొంది. పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జనాల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అతిపెద్ద ఆసుపత్రి, మెడికల్ కాలేజీ 'ఆశ్రం'లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు యాజమాన్యం తెలిపింది. దీంతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందుల్లో పడే పరిస్థితి నెలకొంది.

ఏలూరు జిల్లాలో 31, పశ్చిమలో 29 మొత్తం 60 ప్రయివేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాయి. ప్రతిరోజూ తక్కువగా లెక్కించిన రెండు జిల్లాలో 60కుపైగా ముఖ్యమైన సర్జీలు జరుగుతున్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. డయాలసిస్, గుండె ఆపరేషన్లు, రోడ్డు ప్రమాద కేసుల్లో ఎముకల సర్జీలు, కేన్సర్ రోగులకు సంబంధించి కీమోథెరఫీ వంటి అనేకం జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1500 కోట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లోనూ రూ.70 కోట్లకుపైగా ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క ఆశ్రం ఆసుపత్రికే రూ.15 కోట్ల వరకూ ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు సమాచారం. ప్రతి ఆసుపత్రికీ తక్కువగా లెక్కించినా రూ. 50 లక్షలకుపైగానే ఆరోగ్యశ్రీ సొమ్ములు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసిన పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడినట్లు కొన్ని ఆసుపత్రులు ముందుకు సాగించేందుకు ఒప్పుకున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉందని తెలుస్తోంది. దీంతో అత్యవసర కేసులకు సంబంధించి రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.వేలు, లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకోలేక ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నప్పటికీ ప్రధాన సర్జీలకు సంబంధించిన సేవలు అక్కడ లేకుండా పోయాయి. దీంతో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్లకు, ఆస్మదీయులకు రూ.వేల కోట్లు కట్టబెడుతున్న పాలకులు పేదల కోసం ఖర్చుచేసే ఆరోగ్యశ్రీ బకాయిలు మాత్రం చెల్లించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే పేదల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి రానుంది. ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

డాలర్ల పంటకు.. డీజిల్ దెబ్బ..!

పెట్రోల్ బంకుల్లో లూజ్ డీజిల్ అమ్మకాలు నిలిపివేత

ఆందోళనలో ఆక్వా రైతులు

డీజిల్ అమ్మకాలు చేపట్టాలని విన్నపం

చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు



పోలీసులు పెట్టిన బ్యానర్

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆంక్షల నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాలు, టిన్నుల్లో పెట్రోల్, డీజిల్ పోయరాదని పోలీసు శాఖ ఆదేశించింది. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల యాజమా న్యాలకు, పోలీసులు ఇప్పటికే నోటీసులు అందజేశారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన ఎన్నికల కమిషన్ ఎలక్షన్ కోడ్ పూర్తయ్యే వరకూ కొన్ని రోజులు పెట్రోల్ బంకులకు వచ్చే వాహనాలకు మాత్రమే పెట్రోల్ కొట్టాలని, విడిగా ఎవరైనా వచ్చి పెట్రోల్, డీజిల్ అడిగితే వారి వివరాలు పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలని పోలీసు శాఖ కోరింది. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల కమిషన్ సైతం ఆదేశించింది.

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు ఎండ, ఓ వైపు వర్షం, మరో వైపు మబ్బులుగా ఉంటోంది. ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులుగా ఉండడంతో ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ స్థాయి పడిపోయి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి.

ఎన్నికల వేడి నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలను నిలిపివేస్తూ అన్ని బంకులకు ఇచ్చిన ఆదేశాలు ఆక్వా రైతుల పాలిటశాపంగా మారింది. జిల్లాలో గొడవలు జరగకపోయినా ఇసి ఆదేశాలను ఉన్నతాధికారులు, పోలీసులు కఠినంగా అమలు చేయడంతో అన్ని బంకుల్లో లూజు విక్రయాలను నిలిపివేశారు. వాహనాల్లో మినహా టిన్నుల్లో, డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ వేయడం ఆపేశారు. చేపల చెరువుల్లో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందించేందుకు ఏరియేటర్లను ఏర్పాటు చేస్తారు. జిల్లాలో సుమారు 150 పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. భీమవరం, ఉండి, ఆకివీడు, కాళ్ల, గణపవరం, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి తదితర ప్రాంతల్లో ఎక్కువగా ఆక్వా సాగవుతోంది. జిల్లాలో సుమారు 49,040 ఎకరాల్లో రైతులు రొయ్యల సాగు చేపట్టారు. సుమారు లక్ష ఎకరాలకుపైగా రొయ్యలు, చేపల సాగు చేపట్టారు. ఏటా జిల్లా నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి 14 వేల కోట్లకుపైగా ఆదాయం తెచ్చి పెడుతోంది. చెరువుల్లో కరెంటు మోటార్ల ద్వారా ఏరియేటర్లు నడపగా మరికొన్ని చెరువుల వద్ద ఆటో ఇంజిన్లతో నడుపుతున్నారు. ఆటో ఇంజిన్లు డీజిల్‌తో తిరుగుతాయి. కరెంటు మోటార్లు ఉన్నచోట కరెంట్ పోయినప్పుడు జనరేటర్ల సాయంతో మోటార్లను తిప్పుతారు. దీంతో ఆక్వా రైతులకు డీజిల్ వాడకం ఎక్కువగా ఉంటుంది. సగటున ఎకరం చెరువు ఉన్న రైతు 20 లీటర్ల డీజిల్ వాడుతుంటాడు. ఈ డీజిల్‌ను టిన్నుల్లో నింపుకొని చెరువుల వద్దకు తీసుకెళ్తారు. తాజాగా ఇసి ఇచ్చిన ఆదేశాలతో బంకుల్లో లూజుగా డీజిల్ ఇవ్వకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ఇవ్వకుంటే ఏరియేటర్లు తిరగక ఆక్సిజన్ అందక తమ పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చేపలు, రొయ్యలకు ప్రతి నిమిషమూ ఆక్సిజన్ అందించడం తప్పనిసరి అని, ఏరియేటర్లు ఆగిపోతే వెంటనే చేపలు, రొయ్యలు మృత్యువాత పడతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల గొడవలు లేని ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు డీజిల్ వరకైనా మినహాయింపు ఇవ్వాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. చాలా గ్రామాలు, పట్టణాల్లో కిరాణా దుకాణాలు, కూల్ డ్రింక్ షాప్‌ల వద్ద నిత్యం పెట్రోల్, డీజిల్ అమ్ముతారు. అనుకోకుండా చాలా మంది ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ అయిపోవడంతో షాపుల వద్ద కొనుగోలు వాడతారు. ప్రస్తుతం దుకాణాల వద్ద పెట్రోల్ లేకపోవడంతో కిరణాషాపుల వద్ద రేట్లు సైతం పెంచేశారు. పెట్రోల్ అయిపోయిన వాహనదారులు బంకు వరకూ వాహనం నడిపించుకుంటూ వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని చివరి దశలో ఏరియటర్లు తిరగక ఆక్సిజన్ అందకపోతే రొయ్యలు తేలిపోతాయని, దీంతో తీవ్రంగా నష్టపోతామని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు. నిత్యం డీజిల్ కొనే రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలిపితే విచారించి, వారికి డీజిల్ కొట్టేలా చర్యలు చేడతామని పోలీస్ సిబ్బంది తెలుతున్నారు. నిత్యం కొనే ఆక్వా రైతులకు డీజిల్ కొట్టేలా చర్యలు చేపట్టాలని ఆక్వారైతులు కోరుతున్నారు. కొన్నిచోట్ల తక్కువ మొత్తంలో డీజిల్ కొడుతున్నట్లు సమాచారం.

24 నుంచి ఇంటర్, పది సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ, పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకూ జరగనున్న దృష్ట్యా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఏలూరు అర్బన్ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహాశీల్దార్ వివిఎస్ వివికెవిఆర్ మూర్జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఏలూరులో నారాయణ జూనియర్ కాలేజీ, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, సర్ సిఆర్ఆర్ కాలేజీ, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, సెయింట్ థెరిస్సా మహిళా కాలేజీ, ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీల్లోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ముగిసేవరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఏలూరులోని ఎస్ఇ ఎస్‌డి ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కస్తూరిబాయ్ మున్సిపల్ బాలికల హైస్కూల్, మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ గాంధీనగర్, తూర్పువీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, జెఎంజె (ఇంగ్లీషు మీడియం) హైస్కూల్, సత్రంపాడులోని జెడ్‌పి హైస్కూల్, సెయింట్ థెరిస్సా బాలికల హైస్కూల్, కెపిడిటి హైస్కూల్, ఎఆర్ డిజికె నగరపాలక సంస్థ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, నలుగురికి మించి వ్యక్తులు గుమ్మికూడి ఉండరాదని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ దుకాణాలను అనుమతించకూడదని మూర్జీ తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఐజి తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న ఏలూరు రేజ్ ఐజి అశోక్‌కుమార్

ఏలూరు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల అనంతరం ఇవిఎం ప్యాడ్‌లు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్ తెలిపారు. మూడంచెల భద్రత నడుమ బ్యాలట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24/7 పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉందని తెలిపారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌కు నలువైపులా పోలీస్ పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ గార్డ్ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు.

మహోన్నత వ్యక్తి పర్సా సత్యనారాయణ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కార్మిక వర్గ హక్కుల రక్షణకు జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి పర్సా సత్యనారాయణ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో పర్సా సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతి సభ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ గుంటూరు జిల్లాలో పుట్టి పెరిగి, సింగరేణి బొగ్గు గని కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా హక్కులు, చట్టాలు సాధించారన్నారు. నాడు జరిగిన విశాఖ ఉక్కు ఉద్యమంలో తన ఎంఎల్ఎ పదవికి కూడా రాజీనామా చేసి ఉద్యమానికి బాసటగా నిలిచారన్నారు. ఏళ్ల తరబడి జైలు జీవితం అనుభవించి కార్మిక వర్గానికి అంకితమై పని చేశారన్నారు. 1970లో సిఐటియు ఏర్పడినప్పటి నుంచి 25 ఏళ్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా పని చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు సంఘాన్ని విస్తరించేందుకు ఎనలేని సేవలందించారన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. రాష్ట్రంలో కార్మికులను సంఘటితం చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య ప్రసంగించారు. ఈ సభలో వి.సాయిబాబు, బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, జి.రవికిషోర్, ఎం.నాగమణి, వివిఎన్.ప్రసాద్, పి.కిషోర్, బి.జగన్నాథం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి..

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను అధికారులు గాలికొదిలేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. పవర్‌పేటలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీరు లేక గిరిజనులు అతిసార వ్యాధులు, విష జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ అంబులెన్సులు రన్నింగ్‌లో లేకపోవడం వల్ల సకాలంలో గిరిజన గూడెం ప్రజలకు వైద్యం కూడా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉపాధి కూలీల డబ్బులు బకాయిలు ఉన్నాయని, పనులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపాధి హామీ చట్టం ఉపశమనంగా కొంత ఉపయోగపడుతుందని, వెంటనే ఉపాధి కూలీల బకాయి డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మామిడి, వరి, కూరగాయలు తదితర పంటలు దెబ్బ తిన్నాయని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, దోమలు తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల పరిణామాలను వివరించారు. ఎన్నికలు, కోడ్ పేరుతో ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందన్నారు. కనీసం అధికారులైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఆర్.లింగరాజు, నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు జి.నరసింహారావు, కె.శ్రీనివాస్, రామకృష్ణ, బి.సోమయ్య పాల్గొన్నారు.

మార్గదర్శకులు రాజా రామ్మోహన్‌రాయ్

జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

స్త్రీ విద్య కోసం, సతీ సహగమనం రద్దు కోసం పునాది వేసిన రాజా రామ్మోహన్ రాయ్ మార్గదర్శకులు అని విశ్రాంత తెలుగు భాష ఉపాధ్యాయిని ఎబి.త్రిపుర సుందరి అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో కంప్యూటర్ సెంటర్‌లో ఎంఎస్.లక్ష్మి అధ్యక్షతన రాజా రామ్మోహన రాయ్ 252వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత రాజా రామ్మోహన్ రాయ్ చిత్ర పటానికి త్రిపుర సుందరి పూలమాల వేయగా హాజరైన అందరూ జోహార్లు తెలిపారు. ఎంఎస్.లక్ష్మి మాట్లాడుతూ నేటి విద్యార్థులు గత కాలపు త్యాగ జీవులు, మార్గదర్శకులు చేసిన కృషి, వారి త్యాగాలు తెలుసుకునే ఆసక్తి కలిగించడం కోసం ప్రయత్నంలో భాగంగా విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని చెప్పారు. త్రిపుర సుందరి మాట్లాడుతూ రాజా రామ్మోహన రాయ్ కార్యక్రమంలో సిద్ధార్థ సాయి, జ్ఞానేశ్వరి, సుజీవ్, కీర్తన, మోహిత్, త్రినాధ్, సుకుమార్, లోకేష్, కళ్యాణి, పావని, ప్రవల్లిక పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణ పై కలెక్టర్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల కమిషన్ నిబంధనలకులోబడి జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మొదటి విడత ర్యాండమైజేషన్, ఆర్ఒ, ఎఆర్ఒలకు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణ రూపొందించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘా, వీడియో చిత్రీకరణలో కొనసాగనుంది. అదేవిధంగా 4వ తేదీన వట్లూరులోని సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ బ్లాక్ డ్రాయింగ్ హాల్లో, దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి ఎంబిఎ బ్లాక్ మొదటి అంతస్తులో, ఏలూరు నియోజకవర్గానికి గాను సిఎస్ఇ బ్లాక్ రెండో అంతస్తులో, పోలవరం నియోజకవర్గానికి గాను మెకానిక్ బ్లాక్ మొదటి అంతస్తులో, చింతలపూడి నియోజకవర్గానికి గాను మెకానిక్ బ్లాక్ రెండో అంతస్తులో, నూజివీడు నియోజకవర్గానికి గాను మెకానిక్ బ్లాక్ రెండో అంతస్తు డ్రాయింగ్ హాల్లో, కైకలూరు నియోజకవర్గానికి గాను ఐటి బ్లాక్ నాలుగో అంతస్తులో ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపట్టేందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బాలికపై బాలుడి అత్యాచారం

జువైనల్‌కు నిందితుడు

వీడియో చిత్రీకరించిన నలుగురు అరెస్టు

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - మండవల్లి

బాలికపై జరిగిన అత్యాచారాన్ని చిత్రీకరించి బాలికపై బెదిరింపులకు పాల్పడి లొంగక పోవడంతో వీడియోలను వైరల్ చేసి సభ్య సమాజం సిగ్గుపడేలా చేసిన ఈ సంఘటన పై మండవల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండవల్లి మండలం పుల్లపరు గ్రామానికి చెందిన బాలిక, చింతపాడుకు చెందిన మరో బాలిక ఇరువురు స్నేహితులు. అయితే చింతపాడుకు చెందిన బాలిక పులపర్రుకు చెందిన బాలికను ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం చింతపాడు హైస్కూల్ వద్దకు రమ్మని చెప్పింది. హైస్కూల్ వద్దకు బాలికను ఇక్కడే ఉండమని, ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి చింతపాడుకు చెందిన బాలిక వెళ్లిపోయింది. ఇది గమనించిన చింతపాడుకు చెందిన బాలిక అన్నయ్య పాఠశాల వద్ద ఉన్న పులపర్రు బాలికను జిల్లా పరిషత్ హైస్కూల్‌కి తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. సమయంలో ఆ బాలుడితో పాటు ఉన్న నలుగురు యువకులు ఆ అత్యాచారాన్ని చిత్రీకరించారు. అనంతరం బాధిత బాలికను వేధించడం ప్రారంభించారు. ఆ బాలిక ఆకతాయిలకు ఎంతకీ లొంగకపోవడంతో అత్యాచార వీడియోలను వైరల్ చేశారు. దీంతో ఆ వీడియోలు బాధిత బాలిక తల్లి వద్దకు చేరాయి. దీంతో తల్లి బాలికను అడగగా జరిగిందంతా తల్లికి వివరించింది. అనంతరం బాలిక తల్లి మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామచంద్రరావు కేసు నమోదు చేసుకోగా కైకలూరు రూరల్ సిఐ కృష్ణకుమార్ వివరాలు సేకరించి అత్యాచారానికి పాల్పడిన బాలుడిని విజయవాడ జునైయల్‌కి పంపించారు. అత్యాచార వీడియోలను చిత్రీకరించి వైరల్ చేసిన నలుగురు యువకులను అరెస్టు చేసి కైకలూరు కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. ఇదిలా ఉంటే చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆకతాయిల వేధింపులు తట్టుకోలేక ఉరేసుకుని మృతి చెందింది. ఆ ఘటనలో బాలిక అత్యాచార వీడియోలను చిత్రీకరించి వైరల్ చేసిన నలుగురిలో ఒక యువకుడు నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది.

ఉద్యోగాలకు 56 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న ఆరో సెమిస్టర్ విద్యార్థులు లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా వివిధ ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేస్తుండగానే ఒకేసారి 56 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు విద్యార్థుల నైపుణ్యం, ప్రతిభతో పాటు ప్రేరణాత్మక, సమర్థవంతమైన అధ్యాపకుల కృషి కారణమని చెప్పారు. ఇది ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఘనత అని, హర్షించదగ్గ విషయమని అన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులకు వారి కోర్సులతో పాటు ప్రత్యేకమైన వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పరచడంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల పాత్ర ప్రధానమైందని గుర్తించారన్నారు. గత మూడేళ్లుగా మన కళాశాలలో చదివే డిగ్రీ విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత ఖాళీగా లేరని, వారి శక్తి సామర్థ్యాల ద్వారా ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని క్రమశిక్షణతో మెలుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేవని భ్రమపడే వారికి ఈ ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఒక మంచి ఉద్యోగ అవకాశంగా మారిందన్నారు. డిగ్రీ చదివిన ప్రతి విద్యార్థి తన కాళ్లపై నిలబడే శక్తి సామర్థ్యాన్ని సంపాదించుకోవచ్చన్నారు. మరి ముఖ్యంగా మన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు ఈ అవకాశం ఎక్కువగా కల్పించామని, వారి ఆనందాన్ని వ్యక్త పరిచారని చెప్పారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బైపిసి పూర్తి చేసిన విద్యార్థినికి మానవత శాఖ వారు ఆర్థిక సాయం అందించారు. కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లా దివ్యసాయి ఇంటర్ బైపిసి పూర్తి చేసింది. ఆ విద్యార్థిని ఉన్నత చదువుల కోసం మానవతా శాఖ కొయ్యలగూడెం ద్వారా రూ.మూడు వేలు దివ్యసాయి తల్లి కుమారికి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొమ్మ మోహన్, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, ప్రకాశం జనార్దన్, రామకృష్ణ, ప్రకాశం కాలేజీ ప్రిన్సిపల్ హనుమాన్, వివిఎస్ఎన్.స్వామి పాల్గొన్నారు.

'వైసిపి ఎంఎల్ఎ పిన్నెల్లిని అరెస్ట్ చేయాలి'

ప్రజాశక్తి - కలిదిండి

వైసిపి ఎంఎల్ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో బుధవారం ఆయన మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ బూత్ 202లోకి వైసిపి ఎంఎల్ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులతో ప్రవేశించి ఇవిఎం మిషన్‌ను ధ్వంసం చేయడమే కాక టిడిపి ఏజెంట్లను, ఎన్నికల అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు.

నేరాలు - ఘోరాలు

పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ప్రమాదం

స్కూటీ అదుపుతప్పి అక్కాచెల్లెళ్లకు గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పరీక్ష రాసేందుకు స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో అక్కకు తీవ్ర గాయాలు కాగా, చెల్లికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తాడువాయి గ్రామ శివారు జాతీయ రహదారిపై చోటు చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడువాయికి చెందిన రచన పొంగుటూరులో ఎంబిఎ చదువుతుంది. ఈ క్రమంలో ఆమె బుధవారం నాలుగో సెమిస్టర్ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ మేరకు పరీక్ష రాసేందుకు బుధవారం ఉదయం తన సోదరి అర్చనను తోడుగా తీసుకుని స్కూటీపై పొంగుటూరు బయలుదేరింది. వారు స్కూటీపై తాడువాయి గ్రామం దాటుతుండగా స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న రచనకు తీవ్ర గాయాలయ్యాయి. తన సోదరి అర్చనకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ప్రమాద విషయాన్ని అర్చన ఫోన్ ద్వారా తమ తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వచ్చి గాయాలపాలైన ఇద్దరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భర్త, అత్తమామలపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదనపు కట్నం కోసం వేధించే భర్త, అత్త మామలపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ ఐ.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన కాటబోయిన రాజేశ్వరికి సురేష్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ ఇటీవల భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని రాజేశ్వరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

విద్యుత్ శాఖ ఆస్తిని నష్టపర్చిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - భీమడోలు

అంబరుపేట గ్రామంలో నిర్లక్ష్యంగా వాహనం నడిపి విద్యుత్ శాఖకు చెందిన ఆస్తిని నష్టపరిచిన ఒక బొలెరో వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బొలెరో వాహనం డ్రైవర్ అంబరుపేట గ్రామంలో నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ గ్రామంలో విద్యుత్ సరఫరాకు ప్రత్యేకించిన స్తంభాలను ఢీకొన్నారు. ఈ సంఘటనలో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనపై ట్రాన్స్ కో భీమడోలు ఎఇ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందు తాగొద్దన్నారని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎంఎం.పురం ఆవాస ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి బుధవారం గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎంఎం.పురం ఆవాస ప్రాంతానికి చెందిన పూనూరి నాగేశ్వరరావు(52)కు మద్యం సేవించడం అలవాటుగా ఉంది. దీంతోపాటు ఆయనకు ఇటీవల కాలంలో అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన భార్య ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మద్యం సేవించవద్దని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు క్షణికావేశంలో అందుబాటులో ఉన్న గుళికలను మింగారు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్ఐ బి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలం ముండూరు శివారు బొడ్డువారిగూడేనికి చెందిన వివాహిత బడుగు ధనలక్ష్మి (40) చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం తీవ్రమైన నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని శవపరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. ధనలక్ష్మి మతిపై గ్రామస్తులు అనుమానాలు లేవనెత్తుతున్నారు. మృతురాలి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదుతోపాటు గ్రామస్తుల ఆరోపణలకు అనుగుణంగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని జిల్లా పంచాయతి అధికారి (డిపిఒ) శ్రీనివాస విశ్వనాథ్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దర్భగూడెం సచివాలయన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దర్భగూడెం పంచాయతీలోని తాగునీటి ట్యాంకుల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించగా ట్యాంకును క్లోరినేషన్ చేయకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి ప్రజలు తాగేందుకు తాగునీటిని అందించాలని సిబ్బందికి ఆదేశించారు. మండలంలో ఎక్కడా తాగు నీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఇఒపిఆర్‌డికి సూచించారు. అదే విధంగా మురుగు కాలువలను శుభ్ర పరచడం, రోడ్లను తుడవడం, దోమల నివారణకు ఫాగింగ్, పొగ పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, దేవ ప్రియుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

కలెక్టర్, జెడ్‌పి సిఇఒలకు సిపిఐ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీసత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పని చేస్తున్న శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ వర్కర్స్‌కు బకాయిలు తక్షణం చెల్లించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్.సుబ్బారావులకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ శ్రీసత్య సాయి మంచినీటి పథకం ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సుమారు 180 గ్రామాలకు ఐదు లక్షల మంది ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. ఈ పథకంలో వంద మంది కార్మికులు పని చేస్తున్నారని, ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు జనవరి నెల నుంచి ప్రస్తుత మే నెల వరకు జీతాలు చెల్లించలేదన్నారు. సుమారుగా ఐదు నెలల నుంచి వేతనాలు లేవని, ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులందరూ ఆర్థిక స్థోమతలేని, చిన్న కుటుంబాల నుంచి వచ్చిన వారని తెలిపారు. పల్లెల్లో పచారీ దుకాణాలలో సైతం అప్పు కూడా పుట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని, పిల్లల చదువులకు సంబంధించి ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని, తక్షణమే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఈ పథకంలో వివిధ గ్రేడుల్లో లైన్‌మెన్, ఆపరేటర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారని, గతంలో ఈ పథకం నిర్వహణ చేసిన ఎల్‌అండ్‌టి సంస్థ వారు కార్మికులకు 2021 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2021 జూన్ 15వ తేదీ వరకు రెండు నెలల జీతాలు చెల్లించలేదన్నారు. తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం వద్ద 2021 జూన్ 15వ తేదీ నుంచి 2021 ఆగష్టు ఒకటో తేదీ వరకు పని చేశారని, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం 45 రోజులు జీతాలు చెల్లించలేదన్నారు. నాలుగు నెలల జీతాలు చెల్లించలేదని అవి గాక, ఇప్పుడు నడుపుతున్న కొత్త కాంట్రాక్టరు ఐదు నెలల జీతాలు, ఇఎస్ఐ, ఇపిఎఫ్, బోనస్ చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణం కార్మికులకు చెల్లించాల్సిన ప్రస్తుత ఐదు నెలల జీతాలు, పాత బకాయిలు నాలుగు నెలల జీతాలు ఇప్పించి, ఇఎస్ఐ, ఇపిఎఫ్ బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జీతాల చెల్లింపునకు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినందుకు కలెక్టర్, జిల్లా పరిషత్ కార్య నిర్వహణాధికారులకు డేగా ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎంవిఆర్ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, యూనియన్ సభ్యులు టి.భాస్కరరావు, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నేత డేగా ప్రభాకర్

రైతులు ఆరుతడి విధానం అమలు చేయాలి

వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఉషారాజకుమారి

ప్రజాశక్తి - భీమడోలు

మెట్ట ప్రాంతంలో నీటి ఆదా చేసేందుకు రైతులు వరి సాగులో ఆరుతడి విధానం అమలు చేయడం ద్వారా వచ్చే ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉంటాయని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారి తెలిపారు. భీమడోలులో యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, మిట్టి ల్యాబ్స్ కార్బన్ క్రెడిట్ ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పరిధిలోని ఏడు మండలాలకు చెందిన రైతులకు వరిలో ఆరుతడి సాగు విధానంపై అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులతో పాటు ఆయా మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ, రైతులు నీటి యాజమాన్యం పాటించాలని, నీటిని ఆదా చేయడం ద్వారా రానున్న తరాల కోసం నీటి నిల్వలను భద్రపరచుకోవచ్చని తెలిపారు. సాంప్రదాయ రీతిలో వరి సాగు చేసేందుకు అవసరమైన నీటి మొత్తం కంటే తక్కువ మొత్తంతో ఆరుతడి విధానంలో సాగు చేయడం ద్వారా నీటి ఆదా జరుగుతుందన్నారు. దిగుబడులపై దీని ప్రభావం ఉండదని తెలిపారు. మిట్టి ల్యాబ్స్ ప్రతినిధి మాట్లాడుతూ వరి సాగులో ఆరుతడి విధానం అమలు చేయడం ద్వారా గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం పంటపై పడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. తమ శాఖ ద్వారా జిల్లా పరిధిలో ఏడు వేల హెక్టర్లు విస్తీర్ణంలో ఈ తరహా సాగుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థలకు చెందిన పలువురు ప్రతినిధులు హాజరై వివిధ అంశాల గురించి వివరించారు. కార్యక్రమానికి వివిధ మండలాలకు చెందిన 120 మంది రైతులు హాజరయ్యారు.


అవగాహన సదస్సులో వ్యవసాయ అధికారులు, రైతులు

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

సామాజిక కార్యకర్త మండే సుధాకర్

ప్రజాశక్తి - భీమడోలు

వినియోగదారులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కోరారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్(ఎన్‌సిఆర్‌సి) ఆధ్వర్యంలో వినియోగదారుడా మేలుకో, చట్టం నీకు కల్పించిన హక్కుల గురించి తెలుసుకో అనే అంశంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌సిఆర్‌సి జిల్లా ఛైర్మన్ మణికంఠ మాట్లాడుతూ వినియోగదారుల భద్రత హక్కు, నష్ట పరిహారం పొందే హక్కు, విన్నవించుకునే హక్కు, సమాచార హక్కు, వినియోగదారుడు విద్యను పొందే హక్కు గురించి వివరించారు. ఎన్‌సిఆర్‌ఆర్‌సి ఏలూరు ఇన్‌ఛార్జి పివివి.సత్యనారాయణ మాట్లాడుతూ, సదస్సులో పాల్గొన్న విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను ఇంట్లోని పెద్దలకు తెలియజేయాలని, వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులు ఎన్‌సిఆర్‌సి కార్యక్రమం గురించి వివరిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమామహేశ్వరరావు, మానవత భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో వక్తలు, చిన్నారులు

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ఎండలో ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సాంకేతిక లోపం కారణంగా ఆగిపోయింది. డిపో నుంచి బయలుదేరి డిపోకు కూత వేటు దూరంలో ఉన్న గురవాయిగూడెం గ్రామం ఎంట్రన్స్‌లో బస్సు ఆగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణికులు ఎండలో పడిగాపులు పడ్డారు. సుమారు గంట తర్వాత మరో బస్సులో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకే చేర్చేందుకు ఆర్‌టిసి అధికారులు ఏర్పాట్లు చేశారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులు తరచూ ఏదో లోపం కారణంగా ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పని నిమిత్తం, హాస్పిటల్ పనిపై వెళ్తున్న సమయంలో బస్సులు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. జంగారెడ్డిగూడెం డిపోలో పని చేయని బస్సులకు మరమ్మతులు చేయకుండా అధికారులు ప్రయాణాలకు ఉపయోగించి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పలుమార్లు జంగారెడ్డిగూడెం డిపోపై విమర్శలు వచ్చినా ఆర్‌టిసి అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం ఉండటం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులకు మరమ్మతులను నిర్వహించాలని కోరుతున్నారు.


ప్రయాణికుల పాట్లు

4న రానున్నది టిడిపి కూటమి ప్రభుత్వమే : ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రంలో నెలకొన్న రాక్షస పాలన వచ్చే నెల జూన్ నాలుగో తేదీన అంతం కానుందని, ముఖ్యమంత్రిగా టిడిపి అధినేత చంద్రబాబు బాధ్యతలు స్వీకరిస్తారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసత్యాలు, అబద్ధాల ప్రచారంతో అధికారంలోకొచ్చిన జగన్ అడుగడుగున విధ్వంసకర పాలన సాగించారన్నారు. ఈ జగన్నాసుర పాలనకు చరమగీతం పాడుతూ రాష్ట్ర ప్రజలు ఈనెల 13న తమ ఓటుతో తీర్పు చెప్పారన్నారు. రాష్ట్రంలో ఏదో విధంగా తిరిగి అధికారంలోకి రావాలని వైసిపి రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించిందని, అల్లర్లపై న్యాయ విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగన్‌ను నమ్ముకున్న వారు ఎప్పుడూ అధోగతి పాలు కావాల్సిందేనన్నారు. జగన్ కోసం చట్టాన్ని అతిక్రమిస్తే జైలు పాలయ్యేది అధికారులే అన్న సంగతి గుర్తించాలన్నారు. సిట్ రిపోర్టును తక్షణం బహిర్గతం చేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకులపై దాడి చేసిన వారిని, ఇవిఎంలను పగలకొట్టిన ఎంఎల్‌ఎలపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు బంద్ కావడానికి వైసిపి ప్రభుత్వమే కారణమన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే బిల్లులు రాక ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేశారన్నారు.

నూతన భవన నిర్మాణం చేపడతాం

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగరాణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని బిసి బాలికల వసతి గృహం-1 భవనం స్థానంలో నూతన భవన నిర్మాణం చేపడతామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఏలూరులోని బిసి బాలికల వసతి గృహం-1ను తొలగించి నూతన భవన నిర్మాణానికి మనబడి నాడు-నాడు ఫేజ్-2లో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే భవన నిర్మాణం చేపడతామన్నారు. అప్పటివరకు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న భవనం పక్కనే వసతి గృహంలో విద్యార్థినులకు వసతి, అన్నీ సౌకర్యాలు నడపనున్నట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో పిల్లలు ఎవరూ ఉండటం లేదని నాగరాణి తెలిపారు.

హోమియో వైద్యశాల అభివృద్ధి పనులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

హోమియో వైద్యశాల అభివృద్ధి పనులకు దాతలు సహాయ, సహకారాలు అందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యాధికారిణి డి.రజిత అన్నారు. ఆగిరిపల్లికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు కీర్తిశేషులు యండూర పురుషోత్తం 64వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు యండూరు శశిధర్, లహరి దంపతులు హోమియో వైద్యశాల ఆధునీకరణ పనుల నిమిత్తం రూ.20వేల నగదును వితరణగా వైద్యాధికారిణి రజితకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కాంపౌండర్ ఎన్.బ్రహ్మజ్యోతి పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న శశిధర్ దంపతులు

24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల 24వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి విఎస్‌వి.బ్రహ్మాచారి బుధవారం తెలిపారు. 24వ తేదీన తెలుగు పరీక్షకు 66 మంది విద్యార్థులు, 25వ తేదీన హిందీ పరీక్షకు 36 మంది, 27వ తేదీన ఇంగ్లీష్ పరీక్షకు 36 మంది, 28వ తేదీన గణిత శాస్త్రం పరీక్షకు 94 మంది, 29వ తేదీన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 99 మంది, 30వ తేదీన జీవశాస్త్రం పరీక్షకు 99 మంది, 31వ తేదీన సాంఘిక శాస్త్రం పరీక్షకు 47 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటిసారిగా పదోతరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

CHANGE OF NAME

I, **BOKKA BHAGYA LAKSHMI** W/o. Bokka Durga Mohan Rao, resident D.No. 2-51, Mutyalamma Gudi Meraka, KP Palem North, Mogalthur Mandal, W.G.Dt. A.P. after marriage I have changed my name from **VASAMSETTI BHARATHI** (Old name) to **BOKKA BHAGYA LAKSHMI** (New name) hence forth I am being called **BOKKA BHAGYA LAKSHMI** W/o. Bokka Durga Mohan Rao, for all purposes.

రెండు పేర్లు నావే

ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, కొర్లగుంట గ్రామపంచాయతి పరిధిలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన **తేరా నరసింహారావు** (29), S/o. **మరియదాసు** అలియాస్ **మారుమూడి అఖిల్** అనే నేను ఒకే వ్యక్తిని మా గ్రామంలో రెండు పేర్లతో నన్ను పిలుస్తారు. నా యొక్క ఆధార్, రేషన్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలలో **మారుమూడి అఖిల్** గా నమోదయి ఉన్నదని తెలియపరుస్తున్నాను. ఈ అంశాలలో ఏమైనా దోషాలు వస్తే మీరు తీసుకునే చర్యలకు నేను బాధ్యుడను.

తేరా నరసింహారావు
సెల్: 94917 53125
79890 43575

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.పి. 218/2023

పిటిషనర్: పి.ఎన్.వి.ఎస్.మహాలక్ష్మి
రెస్పాండెంట్: పసుపులేటి నాగరాజు, S/o. సత్యనారాయణ, వయస్సు 43, మార్కెట్ వీధి, అత్తిలి

Order 5 Rule 20 C.P.C. ప్రకారం రెస్పాండెంట్‌కు నోటీసు

పై నెంబర్ ఓ.పి.లో రెస్పాండెంట్‌కు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది. 04-07-2024వ తేదీకి వాయిదా వేసినారు.** కావున రెస్పాండెంట్ పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10 గంటలకు** హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను, లేని పక్షంలో ఓ.పి. తీర్మానం కాబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
పిటిషనర్ తరపు లాయర్
భీమవరం
భీమవరం
ది.22-5-2024 సెల్: 9848539039

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో (Junior Division)
O.S. No. 95/2024

వాద్లు:
1. Pericherla Nitin Kumar Varma, rep. by his G.P.A. Holder and Father Pericherla Rama Devandraju.
2. Pericherla Rama Devandraju

V/s

ప్రతివాది: Kalle Yogesh

రెస్పాండెంట్ అడ్రస్సు:
Kalle Yogesh, S/o. Krishna Mohan, Owner of Villa No. 9, C/o. P.Subrahmanyam, Villa No. 11, Ananda Vihar, Opp:Abhayas School, Peda Amiram, Kalla Mandal, W.G.Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం **ది. 24-6-2024 సం॥ తేదీన 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల ప్రతివాది పరోక్షమున ఈ దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

R.PADMANABHA RAJU
R.V.S.S.SUNEETHA
Advocates, Vissakoderu
Cell: 9849635172

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో (Junior Division)
I.A. No. 213/2024 in
O.S. No. 95/2024

పిటీషనర్లు/ వాద్లు:
1. Pericherla Nitin Kumar Varma, rep. by his G.P.A. Holder and Father Pericherla Rama Devandraju.
2. Pericherla Rama Devandraju

V/s

రెస్పాండెంట్/ ప్రతివాది: Kalle Yogesh

రెస్పాండెంట్ అడ్రస్సు:
Kalle Yogesh, S/o. Krishna Mohan, Owner of Villa No. 9, C/o. P.Subrahmanyam, Villa No. 11, Ananda Vihar, Opp:Abhayas School, Peda Amiram, Kalla Mandal, W.G.Dist.,

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది. 24-6-2024 సం॥ తేదీన 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల రెస్పాండెంట్ పరోక్షమున ఈ దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

R.PADMANABHA RAJU
R.V.S.S.SUNEETHA
Advocates, Vissakoderu
Cell: 9849635172